క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ సభ్యుడిగా జియ్యాని



గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా(ఎస్‌ఈసీ) మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీధర్‌కు రాష్ట్రస్థాయి పదవి లభించడంపై స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు.

రవివర్మ, రాజాజీలకు ఘన నివాళి



చిత్రకారులు రవివర్మ,రాజాజీల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అతిథులు

మల్కాపురం: ప్రముఖ చిత్రకారులు రాజా రవివర్మ, మాదేటి రాజాజీలు చిత్ర,కళారంగానికి చేసిన సేవలు ప్రశంసనీయమని ప్రముఖ చిత్రకారుడు, కళారత్న అవార్డు గ్రహీత సుంకర చలపతిరావు అన్నారు. రవివర్మ వర్ధంతి,రాజాజీ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు గురువారం స్థానిక చిత్రకళా భవనంలో ఆచార్య వై.నర్సింహారావు నివాళులర్పించారు. వారిజీవిత విశేషాలను,చిత్రకళకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిత్రకారులు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కానుకల పంపిణీ

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలువురు పారిశుధ్య కార్మికులకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం ఆధ్వర్యంలో వార్డు నాయకుడు మజ్జి మాలినాయుడు చేతుల మీదుగా దసరా కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుర్గారావు, శ్రీధర్, కన్నారావు, గంట్యాడ గోవింద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీ కాలనీకి చెందిన పార్థనకు ప్రభుత్వ విప్ గణబాబు ట్రై సైకిల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వెంకటాపురం ఎస్సీ బీసీ కాలనీలో పర్యటించినపుడు పార్థన ఇబ్బందులను తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో పార్థనకు ట్రై సైకిల్ అందించారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, స్థానిక నాయకులు దాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎస్‌లో ఉత్తమ చైర్మన్‌గా వెంకటరెడ్డి



ఎస్.ఎస్. షిండే చేతుల మీదుగా ఉత్తమ చైర్మన్ అవార్డు అందుకుంటున్న వెంకటరెడ్డి

కంచరపాలెం: మిలటరీ ఇంజినీర్ సర్వీస్(ఎంఈఎస్)లో ఎంఈఎస్ డే-2025' ను పురస్కరించుకుని సీడబ్ల్యూ అండ్ ఆల్ ర్యాంక్స్ నేతృత్వంలో ఎంఈసీ బిల్డర్స్ అసోసియేషన్ ఇండియా సభ్యులకు ఉత్తమ అవార్డులు ప్రదానం చేశారు. ఎంఈఎస్ కార్యాలయంలో శుక్రవారం కల్నల్ ఎస్.ఎస్. షిండే చేతుల మీదుగా ఉత్తమ చైర్మన్ అవార్డు వెంకటరెడ్డి అందుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ చైర్మన్ సూరిబాబు, వైస్ చైర్మన్ ఎస్. రాజశేఖర్, ఎంవీ రమణ, బి. వేణుగోపాల్, రామ ప్రసాద్‌రెడ్డి, సి.బాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అఖండ భగవన్నామ సంకీర్తన

దాబాగార్డెన్స్: రామ్‌నగర్ రాఘవేంద్రస్వామి మఠంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో దసరా సంగీత మహోత్సవం పేరిట గురువారం 12 గంటల పాటు నిర్వహించిన అఖండ భగవన్నామ సంకీర్తన ఆధ్యాత్మిక చైతన్యం నింపింది. సమితి చైర్మన్ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమితి శిష్యులు, నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు సామూహికంగా గానం చేసి హనుమాన్ చాలీసాతో ముగించారు.

సర్పాలతో సయ్యాట

- ఎంతటి విషసర్పమైనా చిటికెలో పట్టేస్తాడు
- సుమారు 10 వేల పాములను పట్టిన నాగరాజు



నాగరాజు సేవలను మెచ్చి అవార్డు అందిస్తున్న కోస్ట్‌గార్డ్ సిబ్బంది

సింథియా: పాము పేరు వింటేనే చాలా మందికి ఒళ్లు జలదరిస్తుంది. కొంతమంది పాములు తమ కలలో కనిపించినా భయంతో వణికిపోతారు. కళ్ల ముందు పాము కనిపించిందంటే ఇక అంతే సంగతి..వాళ్ల గుండె ఆగినంత పని అవుతుంది. చివరకు పాము బుసకొట్టిన శబ్దం వినిపించినా కూడా భయంతో బిగిసుకుపోతారు. అయితే నాగరాజుకు మాత్రం పాము కనిపిస్తే చాలు..అయ్యో పాపం అంటూ దానిని పట్టుకుని సమీప అడవుల్లో విడిచిపెడతాడు. పాములు మనకు స్నేహితులు వంటివని చెబుతూ వాటి మనుగడకు తోడ్పడుతుండడమే కాకుండా జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడునాగరాజు.

నాగరాజు నేపథ్యం ఇదీ

బర్రి లక్ష్మణరావు, సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడైన నాగరాజు కుటుంబంతో సహా జీవీఎంసీ 63వ వార్డు పరిధి జయేంద్రకాలనీలో నివాసముంటున్నాడు. నాగరాజు తండ్రి పెయింటర్‌గా పనిచేస్తుంటాడు.పదో తరగతి మాత్రమే చదువుకున్న నాగరాజు 15 ఏళ్లుగా పాములు పడుతూ వన్యప్రాణుల సంరక్షణకు తనవంతు కృషి చేస్తున్నాడు. పాములను పట్టుకోవడమే ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. సింథియా, యారాడ, డాక్‌యార్డ్, షిప్‌యార్డ్ వంటి ప్రాంతాల్లో పాములు కనిపిస్తే చుట్టుపక్కల ఉన్నవాళ్లు వాటిని కొట్టి చంపడాన్ని చూసి చలించిపోయిన నాగరాజు పదేళ్ల వయసు ఉన్నప్పుడే పాములను కాపాడాలనే ధృఢ సంకల్పం కలిగిందని చెబుతున్నారు.

సేవలకు గుర్తింపు

నాగరాజు సేవలకు గుర్తింపుగా 2018లో నేవీ అధికారులు అవార్డుతో సత్కరించారు. 2019లో నేవీ కోస్ట్‌గార్డ్స్ నేవీ డే వేడుకల్లో ఉత్తమ సేవా అవార్డుతో సత్కరించగా, 2023లో విశాఖలోని రామకృష్ణ బీచ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డుతో సత్కరించారు. 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో సేవలందించినందుకుగానూ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



వన్యప్రాణి సంరక్షణ సేవలను మెచ్చి అవార్డు అందిస్తున్న అటవీ శాఖ అధికారులు

వన్యప్రాణుల సంరక్షణలో..

వేల పాములను పట్టుకున్న నాగరాజు ఇతర వన్యప్రాణులను కాపాడడంతో కూడా వెనుకడుగువేయడు. ఆర్నెల్ల కిందట డాల్ఫిన్‌నోస్ కొండప్రాంతంలో అరుదైన జాతికి చెందిన పునుగు పిల్లిని సైతం రక్షించి అటవీ అధికారులకు అప్పగించాడు. అదే విధంగా అరుదైన జాతికి చెందిన ఏడు అడుగుల బంగారు వర్ణ నాగుపామును, అరుదైన నక్షత్ర తాబేళ్లు, కొండచిలువలను పట్టుకుని నగరంలోని జంతు సంరక్షణ కేంద్రం(జూ)కు అప్పగించాడు. అదే విధంగా కొండచిలువ గుడ్లు, నాగుపాము గుడ్లు, కింగ్‌కోబ్రా గుడ్లును సంరక్షించి అటవీ అధికారులకు అప్పగించాడు. పాములనే కాకుండా పలు వన్యప్రాణులను సైతం రక్షించడంతో నాగరాజుకు సాటి లేదని నిరూపించుకున్నాడు.ఇటీవల శ్రీహరిపురంలో పామును పట్టుకునే సమయంలో అదే పాము కాటువేయగా ఆస్పత్రి పాలై అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అయినా ప్రభుత్వం తనకు సాయం అందిస్తే వన్యప్రాణి సంరక్షణకు మరింత కృషి చేస్తానని అంటున్నాడు.



అరుదైన జాతికి చెందిన పునుగుపిల్లిని అటవీ అధికారులకు అప్పగిస్తున్న నాగరాజు



పాములు కనిపిస్తే ఫోన్ చేయండి

VISAKHA SNAKE CATCHER WELFARE ASSOCIATION
Regd. No. 318 / 2019
NAGARAJU
VISAKHAPATNAM
Cell : 7569135128

స్నేక్ సొసైటీ లోగో

సాధారణంగా పాములు మనుషులకు హాని చేయవు. భయపెట్టడానికి మాత్రం బుసలుకొడతాయి. వాటిని హింసిస్తే కాటు వేస్తాయి. పాములు కనబడగానే అటవీ అధికారులకు, మాలాంటి వారికి ఫోన్ చేస్తే వచ్చి పాములను పట్టుకుంటారు. ఏడుగురితో రెస్క్యూబృందం నడిపిస్తున్నాం. పాములు పట్టే విషయంలో సాయం కావాలన్నా7569135128 నంబరుకు ఫోన్ చేయవచ్చు. పాములను సంరక్షించేందుకు విశాఖ స్నేక్ క్యాచర్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో సంస్థ నడుపుతున్నామని నాగరాజు తెలిపారు.

యువకుడిని కాపాడిన ఆర్‌పీఎఫ్ పోలీసులు



పవన్ కుమార్‌ను తల్లికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

గోపాలపట్నం: నార్త్ సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద ఆత్మహత్యకు యత్నిస్తున్న యువకుడిని రైల్వే పోలీసులు కాపాడారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. చినముషిడివాడ దరి శాంతినగర్‌కు చెందిన కిల్లి పవన్ కుమార్(23) గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి పోయాడు. రాత్రి 12.30 గంటల సమయంలో సింహాచలం రైల్వే స్టేషన్‌లో గూడ్స్ ట్రాక్ వద్ద ఆత్మహత్యకు యత్నిస్తుండగా గమనించిన రైల్వే ఏఎస్‌ఐ సీతారామ్, హెచ్‌సీ సీహెచ్. ధనుంజయ్ యువకుడిని రక్షించారు. వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో యువకుడు తల్లి కనకమహాలక్ష్మి రాగా యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. అయితే పవన్ కుమార్‌కు మతిస్థిమితం లేదని .. అందువల్లే ఈ విధంగా ప్రవర్తించాడని తల్లి కనకమహాలక్ష్మి తెలిపారు. రైల్వే పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి ఉత్సవాలు



పూజలు చేస్తున్న శ్రీనివాసరావు, భవానీ భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. భారీ అన్నదానం, అమ్మవారి ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు వానపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో హేమంత్‌సాయి, మణివర్ధన్, మనోజ్‌కుమార్, వి.సుప్రజ, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా దసరా వేడుకలు



దుర్గాదేవి వేషధారణల్లో చిన్నారులు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో దసరా వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద అల్లరి యూత్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో బొట్టా వెంకటప్పారావుయాదవ్,నమ్మి శంకర్‌రావుయాదవ్ పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమలతో అర్చనలు చేశారు.

► 60వ వార్డు శ్రీహరిపురంలో బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు చిన్నారులు దుర్గాదేవి వేషధారణలో అమ్మవారి కీర్తనలకు నృత్యాలు చేశారు.సిస్టర్ సింధూ తదితరులు పాల్గొన్నారు.

► గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబా సమాధి ఉత్సవాలను నిర్వాహించారు.సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు.నిర్వాహకుడు నాగేశ్వరరావు పేదలకు చీరలు,దుప్పట్లు పంపిణీ చేశారు.

వాల్తేర్ డివిజన్‌లో 'స్వచ్ఛతా అభియాన్'



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద గాంధీజీ విగ్రహానికి డీఆర్ఎం లలిత్ బోహ్రా అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 2 నుంచి 15 వరకు వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్ఎం తెలిపారు. రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించిన రోజు స్వచ్ఛ భారత్-స్వచ్ఛ రైలు సాధ్యమని పేర్కొన్నారు. పలు క్లీనింగ్ పరికరాల పనితీరును డీఆర్ఎం స్వయంగా పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారం(ఇన్‌ఫ్రా), ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఖైదీలు సోదర భావంతో మెలగాలి



ఖైదీకి బహుమతి అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు, కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: కారాగారంలోని ఖైదీలంతా సోదర భావంతో కలిసి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు అన్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో గురువారం గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. గాంధీ జయంతినే ఖైదీల సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు ఖైదీలకు పలు పోటీలు నిర్వహించారు. ఖైదీలు వివిధ వేషధారణలో ప్రదర్శించిన నాటికలతో అతిథులను అలరించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను అనుసరించి మెలగాలని ఖైదీలకు సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ శాంతియుత సమాజం దిశగా అందరూ నడుచుకోవాలన్నారు. కారాగారం శిక్షణాలయమని, ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లిన తర్వాత ఉన్నతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో జైల్ పర్యవేక్షణాధికారి ఎన్.సాయిప్రవీణ్, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

గాంధీజీ సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం

సింథియా: గాంధీజీ సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. గుడివాడఅప్పన్నకాలనీ, ఎస్సార్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన గాంధీజీ జయంతి వేడుకలకు లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు మసేనమ్మ, సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

► జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో మహాత్మా గాంధీ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత గాంధీజీని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరికి సాయపడాలన్నారు.



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



గాంధీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: దేశానికి మహాత్మా గాంధీ అందించిన సేవలు మరువలేనివి అని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం కొనియాడారు. మల్కాపురం వద్ద గురువారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన బాటలో నేటి యువత నడవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ మోనటరింగ్ సభ్యుడు మల్లేశ్వరరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

అనధికార పార్కింగ్‌తో ఇక్కట్లు

- వాహనాల మాటున అసాంఘిక కార్యకలాపాలు
- పార్కింగ్ జోన్‌గా మారిన ఎన్ఏడీ ఫ్లైఓవర్ దిగువభాగం
- పెచ్చుమీరుతున్న ఆకతాయిల ఆగడాలు
- ఎన్ఏడీలో నిఘా కరువైందని వాపోతున్న స్థానికులు



ఫ్లైఓవర్ దిగువన పార్కింగ్ చేసిన వాహనాలు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువన అనధికారికంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ దిగువన అంబేడ్కర్ విగ్రహం వద్ద , ఇటు శివాలయం వైపున భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఈ వాహనాల మాటున ఆకతాయిలు చేరి మద్యం, గంజాయి వంటివి సేవిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ దారిగుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని గణేష్‌నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితిలో అంబేడ్కర్ నగర్, గురజాడ నాగర్ వాసులు అనుభవిస్తున్నారు.

ఎన్ఏడీ జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వైపు వాహనాల పార్కిగ్ చేయడం వల్ల గంజాయి బ్యాచ్, మందుబాబులు తమ అడ్డాగా వినియోగిస్తున్నారు. వీరికి మంచి చెప్పినా తిరగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొంగలకు అడ్డాగా...

ఎన్ఏడీ ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం దొంగలకు అడ్డాగా మారిందని ఇక్కడి వారు వాపోతున్నారు. ఫ్లైఓవర్ దిగువన ఎక్కువ సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల చిల్లర దొంగలు ఇక్కడే కాపుకాసి వాహనాల బ్యాటరీలు, పరికరాలు ఎత్తుకుపోతున్నారు. ఇదంతా పట్టపగలే చోటుకోవడంతో ఒకరిద్దరి దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటనలు ఉన్నాయి. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా కొరవడడంతో ఆకతాయిలు, చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు.



ఎన్ఏడీ ఫ్లై ఓవర్ దిగువన పార్కింగ్ చేసిన వ్యాన్లు, భారీ వాహనాలు



ఎన్ఏడీ జంక్షన్‌లో అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలు

సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంతా సమయ పాలన పాటించాలని, రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో)డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్, స్వతంత్రనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను(యూపీహెచ్‌సీ) సందర్శించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆరోగ్య పథకాలపై అవగాహన ఉండాలన్నారు. వైద్యులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.